01 page 14_01 page 14.qxd 11/14/2026 10:41 PM Page 1

కర్నూలు | నంద్యాల వార్త

15 నవంబర్ 2026 ఆదివారం పేజీలు 4

కోసిగి మేజరు సర్పంచ్ పీఠంపై..

పెరుగుతున్న.. ఆశావాహుల పోటీ..!

- ఒకే పార్టీ నుంచి ముగ్గురు నేతల పేర్లు వైరల్..
- ఎవరికి దక్కనుంది అవకాశం.. గ్రామ రాజకీయాల్లో ఆసక్తికర చర్చ..

కోసిగి మేజరు గ్రామ పంచాయతీ.. సర్పంచ్ పీఠంపై రాజకీయ ఆసక్తి రోజు రోజుకూ పెరుగుతోంది.. త్వరలో జరగనున్న సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి.. సర్పంచ్ పదవిని దక్కించుకోవాలనే ఆశతో పలువురు నేతలు గత కొద్ది రోజుల నుంచే తమ ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు స్థానికంగా చర్చ సాగుతోంది.. ముఖ్యంగా ప్రధాన పార్టీలకు చెందిన ఆశావహులు తమ అనుచరులు, అభిమానులతో మంతనాలు జరుపుతూ రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నారు..







కోసిగి, నవంబరు 14, ప్రభాతవార్త

ఒకే పార్టీకి చెందిన ముగ్గురు నేతల పేర్లు, అంటే టీడీపీ సీనియర్ నాయకులు ముత్తారెడ్డి, అలాగే మరో యువ నాయకుడు చింతలగేని నర్సారెడ్డి వీరివురు రాఘవేంద్రరెడ్డి వర్గీయులే..కాగా టీడీపీలోనే మరో నాయకుడు తిక్కారెడ్డి వర్గం నుండి కొండగేని వీరారెడ్డిలు బరిలో ఉన్నట్లు, వారి ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడం గ్రామ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది..ముగ్గురు నేతలు సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో నిలబోతున్నారా.. లేక పార్టీ అధిష్టానం ఆశీస్సుల కోసం తమ బలాన్ని ప్రదర్శిస్తున్నారా.. అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.. ఒకే పార్టీ నుంచి ముగ్గురు నేతల పేర్లు తెరపైకి రావడంతో ఎవరికి అవకాశం దక్కుతుందన్న ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకుంది.. కోసిగి మేజరు పంచాయతీ కావడంతో సర్పంచ్ పదవికి ప్రత్యేక రాజకీయ ప్రాధాన్యత ఉంది.. గ్రామంలో ఉన్న రాజకీయ ప్రభావం, సామాజిక సమీకరణాలు ప్రజల్లో నాయకులకుఉన్నఆదరణ ఎన్నికల ఫలితా లను ప్రభావితం చేసే అవకాశం ఉంది.. ఈ నేపథ్యంలో ఆశావహులు ఇప్పటి నుంచే తమ అనుచరగణాన్ని సమీకరించుకోవడం, గ్రామస్థులతో సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది..మరోవైపు ఒకే పార్టీ నుంచి ముగ్గురు నేతలు పోటీకి ఆసక్తి చూపితే పార్టీ పెద్దలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది..ముగ్గురిలో ఒకరికి పార్టీ మద్దతు లభిస్తుందా లేక చివరి నిమిషంలో కొత్త అభ్యర్థి తెరపైకి వస్తారా..అనే చర్చ కూడా సాగుతోంది..సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫోటోలు ఈ రాజకీయ చర్చకు మరింత ఆజ్యం పోస్తున్నాయి.. ఎని న్నికల రెండో నోటిఫికేషన్ వెలువడక ముందే కోసిగి సర్పంచ్ పీఠం చుట్టూ రాజకీయ వేడి మొదలు కావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది..రాజోయే రోజుల్లో మరెంత మంది ఆశావహులు తెరపైకి వస్తారు.. ప్రధాన పార్టీలు ఎవరికి ప్రాధాన్యత ఇస్తాయో..చివరికి సర్పంచ్ అభ్యర్థిగా ఎవరు నిలుస్తారో అన ్ని వేచి చూడాల్సిందే..

అధికార పార్టీలో లుక..లుకలు..!



వైస్ చైర్మన్ పదవి లొల్లి . ..
40 ఏళ్లుగా పార్టీకి సేవలకు మంగళమేనా
రెండు సార్లు గెలిచినా..
ముళ్ళబాటేనా ..
ఒక్కసారి గెలిచినవారికి వైస్ చైర్మెన్ ఇంచార్జి మినిస్టర్ కు పిర్యాదు చేయనున్న ఆశావహులు.

నంద్యాల ప్రభాతవార్త ప్రతినిధి :

నంద్యాల మున్సిపల్ ఎన్నికలు కార్యకర్తలు,గెలిచిన అభ్యర్థుల్లో లుకలుకలు మొదలయ్యాయి.ఎన్నికల్లో అధికార పార్టీ ఉన్నప్పటికీ వైసిపికి అధిక సంఖ్యలో కౌన్సిలర్ అభ్యర్థులుగెలుపొందారు. కూటమిలో ఐక్యమత్యం, నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంతో మున్సిపల్, జెడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల్లో వైసిపి విజయకేతనం ఎగురవేసింది.ఈ నేపథ్యంలోనే టీడీపీ తమ్ముళ్ళ మధ్య వైస్ చైర్మెన్ పదవి ఆజ్యం పోస్తుంది.ఎన్నికలు ముగిసిన తర్వాత గెలుపొందిన,ఓడిన అభ్యర్థులతో నేతలు పరామర్శలు చేయలేదని కొందరు ఆగ్రహంగా ఉన్నట్టు తెలుస్తోంది

టీడీపీ నీ నమ్ముకొని లక్షలు ఖర్చుపెట్టి 40 ఏళ్లుగా పార్టీని నమ్ముకున్న వారు అన్నివిధాలుగా నష్టపోయినా పార్టీ కోసం పనిచేస్తున్నారు.ఈ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు బయటపడకుండా తమకే వైఎస్ చైర్మెన్ పదవి వస్తుందని ఆశపడ్డారు.నేతలు సైతం టిడిపి లో గెలిచిన వారికి ఎవరికి ఒక్క మాటకూడా వైస్ చైర్మెన్ పదవి పలానా వారికి ఇస్తామని చెప్పలేదని కొందరు ఆశావహులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నేతలు వారికి వచ్చిన విధంగా ప్రవర్తిస్తే పార్టీని నమ్ముకున్న వారి పరిస్థితి ఏంటి అని ప్రశ్నిస్తున్నారు.అసలే సర్పంచ్ ఎన్నికల ముందు ఇలాంటి విపత్కర పరిస్థితి నెలకొనడంతో కార్యకర్తల్లో అయోమయ పరిస్థితి నెలకొంది.గెలుపొందిన అభ్యర్థులతో మాట్లాడి వైఎస్ చైర్మెన్ పదవి ప్రకటించాలి కానీ ఇప్పటికే దాదాపు నలుగురు నుంచి ఐదు మంది వైస్ చైర్మెన్ పదవి మాస్క్ వస్తుందని మద్దతు ఇవ్వాలని ఒకరికి తెలియకుండా ఒకరు వచ్చిపోతుంటే అర్థం కానీ పరిస్థితి ఎదురైందని వాపోతున్నారు.గెలిచిన అభ్యర్థుల్లో కొందరు ఆశావహులు ఇంచార్జ్ మినిస్టర్ దృష్టికి తీసుకొని వెళ్లేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది.వైఎస్ చైర్మెన్ పదవి టీడీపీ కి వస్తుందా,వైసిపి కి వస్తుందా అని తెలకముందే నంద్యాల టీడీపీ లో అసంతృప్తులు మొదలయ్యాయి.ఇప్పటికే మూడు ఎన్నికల్లో టీడీపీ కంటే వైసిపి ముందంజలో ఉండడం,సర్పంచ్ ఎన్నికల్లో గెలుపు వ్యూహాలు రచించే సమయంలో వైఎస్ చైర్మెన్ లొల్లి నాయకులు ఏవిదంగా పరిష్కారం చేస్తారో అర్థం కానీ పరిస్థితి.

సైకిల్ దిగి ప్యాన్ గాలికి చేరిన బిల్లలాపురం 30కుటుంబాలు

నంద్యాల, నవంబరు 14,ప్రభాతవార్త ప్రతినిధి



సైకిల్ మీద ఉండ లేక అక్కడ ఉక్కపోత తట్టుకోలేక ప్యాన్‌కిందకు 30కుటుంబాలు చేరిన వైనము నంద్యాల మండలంలోని బిల్లలాపురము గ్రామంలో చోటు చేసుకుంది. నంద్యాల మండలంలోని బిల్లలాపురము గ్రామంలో తెలుగు దేశం పార్టిలో ఇముడ లేక శిల్పారవి చంద్రికిశోరురెడ్డి సమక్షంలో శనివారము ఉదయం వైసిపి పార్టిలో చేరారు.గ్రామానికిచెందిన శంఖరరెడ్డి, శ్రీని వాసరెడ్డి యంపిటిసి మెంబరు గడు, అద్వర్యంలో 30కుటుంబాలు వైసిపి తీర్థంపుచ్చుకున్నారు.ఈసందర్భముగా శిల్పా రవి మాట్లాడుతూ పంచాయితీ ఎన్నికల పలితాలు తెలుగు దేశం పార్టికి ప్రతికూల రాజకీయ పరిణామాలకు సంకేతమని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వంఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలన్నారు హామీల అమల్లో విఫలమైతే ప్రజల నుండి రాజకీయాంలగ ఖ్యతిరేకతె దుర్కొవాల్సిన వస్తుందని పేర్కొన్నారు

అన్ని స్థానాలను కూటమి అభ్యర్థులు కైవసం చేసుకోవాలి

: మంత్రి ఎన్ఎండి ఫరూక్



నంద్యాల, నవంబర్ 14 ప్రభాతవార్త ప్రతినిధి :

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రేపటి (నవంబర్ 15) నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో, శనివారం నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నంద్యాల, గోస్పాడు మండలాలకు చెందిన టిడిపి ముఖ్య నాయకులతో మంత్రి ఫరూక్ సుదీర్ఘంగా చర్చించి ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో టిడిపి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. నామినేషన్ల దాఖలు నుండి పోలింగ్ వరకు పూర్తి సమన్వయంతో పనిచేసి, నంద్యాల మరియు గోస్పాడు మండలాల్లోని సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలన్నింటినీ కూటమి అభ్యర్థులు కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు , పాణ్యం వెంకటేశ్వర్లు మరియు నంద్యాల , గోస్పాడు మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల నామినేషన్లకు పోలీసు బందోబస్తు

: నామినేషన్ కేంద్రాల్లో అభ్యర్థితో పాటు ఇద్దరికే అనుమతినిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

కర్నూలు, నవంబర్ 14, ప్రభాతవార్త :



పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా జిల్లాలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు ఇద్దరు ప్రతినిధులకు మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్రాల వద్ద ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించడం, గుంపులుగా రావడం పూర్తిగా నిషేధమన్నారు. జిల్లాలో 30 పోలీస్ యాక్ట్, సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ కింద నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయని తెలిపారు. నామినేషన్ కేంద్రాలకు 100 నుంచి 200 మీటర్ల పరిధిలో జనసమూహాలు గుమిగూడడం, నినాదాలు చేయడం, ఎన్నికల ప్రచారం నిర్వహించడం అనుమతించబడదన్నారు. కేంద్రాల పరిసరాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక పోలీసు బందోబస్తు చేపట్టినట్లు వెల్లడించారు. ఎన్నికల నియమావళిని ఉల్లం ఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వ హించేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రాప్తాడు ఘటన నిందితుడికి.. కర్నూలు జీజీహెచ్‌లో మెరుగైన వైద్యం

- **: ఊపిరితిత్తుల్లోని రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టినట్లు గుర్తింపు**
- **: ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉంది**
- **: 24 గంటల పాటు వైద్యుల నిరంతర పర్యవేక్షణ**

కర్నూలు,హాస్పిటల్ నవంబర్ 14 ప్రభాతవార్త:

అనంతపురం జిల్లా రాప్తాడు పాఠశాల తరగతి గదిలో విద్యార్థినిపై ఎలక్ట్రిక్ రంపంతో దాడి చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో నిందితుడిగా ఉన్న హేమంత్ గత కొద్ది రోజులుగా అనంతపురంలో చికిత్స పొందుతుండగా, మెరుగైన వైద్య సేవల కోసం శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. ఆసుపత్రికి చేరుకున్న వెంటనే సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీ.ఎం.ఓలు, డ్యూటీ సర్జన్, అసిస్టెంట్ సర్జన్, ఆర్థోపెడిక్ సర్జన్, కార్డియో థొరాసిక్ సర్జన్, కార్డియాలజీ వైద్య బృందం రోగిని పరిశీలించి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో ఊపిరితిత్తుల్లోని కొన్ని రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టినట్లు గుర్తించారు. దీంతో వైద్య నిపుణులు తదుపరి పరీక్షలు నిర్వహించి, రక్తపు గడ్డలను కరిగించేందుకు అవసరమైన చికిత్సను ప్రారంభించారు. శనివారం ఉదయం సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు రోగి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. అనంతపురం నుంచి వచ్చిన సమయంలో కొంత ఆయాసంతో బాధపడిన ప్పటికీ, కర్నూలు ఆసుపత్రికి చేరుకున్న తర్వాత ప్రస్తుతం ఆయాసం తగ్గిందని, రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, 24



గంటల పాటు నిరంతర వైద్య పర్యవేక్షణలో ఉంచి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సంబంధిత వైద్యాధికారులు, వైద్య బృందానికి సూపరింటెండెంట్ సూచించారు. అవసరమైన అన్ని వైద్య పరీక్షలు, చికిత్సలను అందిస్తూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. రోగి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు డాక్టర్ కె. వెంకటేశ్వర్లు తెలిపారు.

ఏకగ్రీవ పంచాయతీలకు.. భారీ ప్రోత్సాహకాలు..!

: జనాభా ఆధారంగా రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు నగదు ప్రోత్సాహకం

: సర్పంచ్‌తో పాటు అన్ని వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం కావాలి

జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, నవంబర్ 14, ప్రభాతవార్త :

గ్రామాల్లో సామరస్యం, ఐక్యతను పెంపొందించి, ఏకాభిప్రాయంతో స్థానిక స్వపరిపాలనను బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల ఏకగ్రీవ ఎన్నికలకు భారీ ప్రోత్సాహకాలను ప్రకటించిందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు.ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యులున్న గ్రామ పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రోత్సాహకం అందించనున్నట్లు వెల్లడించారు. 5 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.15 లక్షలు, 5,001 నుంచి 10 వేల జనాభా ఉన్న పంచాయతీలకు రూ.25 లక్షలు, 10 వేలకు పైగా జనాభా ఉన్న పంచాయతీలకు రూ.50 లక్షలు అందించనున్నట్లు పేర్కొన్నారు.గతంలో 2 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.5 లక్షలు, 2,001 నుంచి 5 వేల వరకు జనాభా ఉన్న వాటికి రూ.10 లక్షలు, 5,001 నుంచి 10 వేల వరకు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.15 లక్షలు, 10 వేలకు పైగా జనాభా ఉన్న పంచాయతీలకు రూ.20 లక్షలు ప్రోత్సాహకంగా అందించేవారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం ఈ మొత్తాలను గణనీయంగా పెంచిందన్నారు.అయితే సర్పంచ్‌తో పాటు అన్ని వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు ఏకగ్రీవమై, ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించిన గ్రామ పంచాయతీలకు మాత్రమే ఈ ప్రోత్సాహకాలు వర్తిస్తాయని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల అధికారులు ఏకగ్రీవ ఎన్నికను అధికారికంగా ధ్రువీకరించిన అనంతరం ప్రోత్సాహకాలు అందజేస్తారని తెలిపారు.

పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలి

నంద్యాల నవంబర్14 ప్రభాతవార్త ప్రతినిధి:

నామినేషన్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా, ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు..జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ నంద్యాల జిల్లా వ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఆదేశించారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు కేవలం ఇద్దరు ప్రతినిధులకు మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి అనుమతి ఉంటుందని తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించడం, గుంపులుగా చేరడం, నినాదాలు చేయడం, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం నిషేధమని స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో 100 నుంచి 200 మీటర్ల పరిధిలో ఎలాంటి జనసమూహాలు గుమిగూడకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ 30 మరియు సెక్షన్ 163నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని, నామినేషన్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేయడంతో పాటు పటిష్టమైన పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంతమైన, పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు అభ్యర్థులు, ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు.



బ్లైండ్ ఫౌండేషన్‌కు అవసరమైన పరికరాలు అందజేసిన.. మంత్రి టీజీ భరత్

: సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తాం మంత్రి టీజీ భరత్

కర్నూలు,హాస్పిటల్ నవంబర్ 14 ప్రభాతవార్త :

కర్నూలు నగరంలోని మంత్రి టీజీ భరత్ కార్యాల యంలో.. బ్లైండ్ ఫౌండేషన్ సంస్థకు కర్నూలు ఎగ్జిబిషన్ సొసైటీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన వాషింగ్ మిషన్, రిఫ్రిజిరేటర్, కంప్యూటర్, ఆఫీస్ టేబుల్స్, డెస్క్‌టాప్, కీబోర్డులను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. బ్లైండ్ ఫౌండేషన్ వంటి సేవా సంస్థలకు టీజీవీ గ్రూప్ సంస్థలతో పాటు కర్నూలు ఎగ్జిబిషన్ సొసైటీ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. గతంలో బ్లైండ్ ఫౌండేషన్‌ను సందర్శించిన సమయంలో సంస్థ ప్రతినిధుల కోరిక మేరకు కంప్యూటర్లను అందజేశామని గుర్తు చేశారు. తాజాగా సంస్థ ప్రతినిధులు తమకు అవసరమైన వస్తువులను సమకూర్చాలని విజ్ఞప్తి చేయడంతో కర్నూలు ఎగ్జిబిషన్ సొసైటీ సౌజన్యంతో వాషింగ్ మిషన్,



రిఫ్రిజిరేటర్, కంప్యూటర్, ఆఫీస్ టేబుల్స్, డెస్క్‌టాప్, కీబోర్డులను అందజేసినట్లు వెల్లడించారు. టీజీవీ గ్రూప్ సంస్థల ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులోనూ ఈ సేవా కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. సేవా సంస్థలకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు.అనంతరం బ్లైండ్ ఫౌండేషన్ ప్రతినిధి సుధాకర్ మాట్లాడుతూ.. రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, ఆయన కుమారుడు, రాష్ట్ర మంత్రి టీజీ భరత్ తమ సంస్థకు నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. కర్నూలు నగరంలో టీజీ కుటుంబం అందిస్తున్న సేవా కార్యక్రమాలను చిన్నప్పటి నుంచి చూస్తున్నానని, దశాబ్దాలుగా వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. ముఖ్యంగా బ్లైండ్ ఫౌండేషన్‌కు వారు అందిస్తున్న సహకారం సంస్థ కార్యకలాపాలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని, భవిష్యత్తులోనూ ఇదే విధమైన సహకారం కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత టీడీపీ నేత గౌరు వెంకటరెడ్డి, కర్నూలు నగర మేయర్ విజయ ప్రత్యూష, బ్లైండ్ ఫౌండేషన్ ప్రతినిధి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

02 page 14_02 page 14.qxd 11/14/2026 10:39 PM Page 1

రైతుల రైతు కూలీల బిడ్డలు దేశ విదేశాల్లో మంచి మంచి ఉద్యోగాలు సాధించాలి

హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు కొరపోలు నాగేంద్ర ప్రసాద్.

వెల్దుర్తి,నవంబర్14,ప్రభాతవార్త



కర్నూలు జిల్లా వెల్దుర్తి బాలికల వసతి గృహంలో వసతి పొందుతూ విద్యనభ్యసిస్తున్న రైతులు, రైతు కూలీల బిడ్డలు ఎన్నో విజయాలు సాధిస్తున్నారని అన్నింటినీ మిత్రుల ద్వారా తెలుసుకుంటున్నాము, మీడియా ద్వారా చూస్తున్నామని వీరు మరిన్ని విజయాలు సాధించి దేశ విదేశాల్లో గొప్ప, గొప్ప ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల కల నిజం చేయాలని హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు కొరపోలు నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా వెల్దుర్తి బాలికల వసతి గృహంలో వసతి గృహ అధికారిణి గిరిజ దేవి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తమ అమ్మ స్వయంప్రభ తో కలిసి ఆయన పాల్గొని వక్తృత్వ, క్విజ్ పోటీల్లో పాల్గొని విజయం సాధించిన విద్యార్థినిలకు బహుమతులు అందజేసి విద్యార్థినిలకు మోటివేషన్ గా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన వెల్దుర్తి బాలికల వసతి గృహాన్ని అత్యున్నతంగా తీర్చిదిద్దిన వసతిగృహ అధికారిణి గిరిజాదేవిని ఎంతో అభినందించారు. ఇక్కడి విద్యార్థినీలు జిల్లా స్థాయిలో మంచి పేరు సాధిస్తున్నారని విద్యార్థినీల విజయాలు రాష్ట్రము మరియు ఖండాంతరాలకు వ్యాపించాలని కోరారు. హిందీ పండిట్ గా తమ అమ్మ వెల్దుర్తి బాలికల పాఠశాలలో పని చేసిందని తెలిపారు. హిందీ స్వయంప్రభ మాట్లాడుతూ ఆడపిల్లలు వెనుకడుగు వేయకూడదని అంతరిక్షాన్ని కూడా నేడు ఏలుతున్నది ఆడపిల్లలే కాబట్టి చదువుల్లో ఆటలలో ఆడపిల్లలు విజయం సాధించాలని, వెల్దుర్తి బాలికల వసతిగృహ విద్యార్థినీలలో ఈసారి హిందీ పరీక్షల్లో 90 మార్కులు సాధించిన ప్రతి విద్యార్థినికి వెయ్యి రూపాయలు క్యాష్ ప్రైజ్ ఇస్తానని తెలిపారు. వెల్దుర్తి బాలికల వసతి గృహం కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి చెందుతుందని అందరూ ఈ అభివృద్ధికి సహకరించాలని హిందీ పండిట్ గఫూర్ కోరారు.ఈ సందర్భంగా వెల్దుర్తి వసతి గృహ అధికారిణి గిరిజా దేవి కొరపోలు నాగేంద్రప్ర సాద్ను మరియు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత హిందీ పండిట్ స్వయంప్రభ ను శాలువ పూలమాలతో సత్కరించారు. ఈ సంద ర్భంగా కర్నూలు జిల్లా ఉత్తమ వసతి గృహ అధి కారిణిగా అవార్డు అందుకున్న గిరిజాదేవిని హెల్పిం గ్ హ్యాండ్స్ సేవా సంస్థ తరఫున శాలువా పూల మాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమం లో వసతి గృహాధికారిణి గిరిజాదేవి ,హిందీ పండిట్ గఫూర్, హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ అధ్యక్షులు హరిసింహనాయుడు పాల్గొన్నారు.

పత్తికొండ పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా మాజీ సర్పంచ్ సోమశేఖర్ ఎంపిక..



పత్తికొండ నవంబర్ 14 ప్రభాతవార్త:

పత్తికొండ పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ సోమశేఖర్ను ..మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ రాష్ట్ర ఎస్ఈసీ సభ్యులు రామచంద్రారెడ్డి , మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ ఎంపిక చేశారు.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో పత్తికొండ పట్టణంలో క్రియాశీలకంగా పనిచేస్తూ, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న సోమశేఖర్కు సర్పంచ్ అభ్యర్థిగా అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేసి పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని, ఐకమత్యంతో ముందుకు సాగుతూ పత్తికొండ పట్టణంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలి

గోనెగండ్ల, నవంబరు 14, ప్రభాతవార్త



గ్రామ సర్పంచ్ ఎన్నికలు గ్రామాలలోని నాయకులు, ప్రజలు ప్రశాంత వాతవరణంలో జరుపుకోవాలని గోనెగండ్ల తహసీల్దార్ రాజేశ్వరి కోరారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఎన్నికలలో పోటీ చేసే వారికి కావలసిన క్యాస్ట్ ఇతరత్ర సర్టిఫికేట్ లకు కోసం ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు. డ్యూటీ సమయంలో ప్రతి గ్రామ వీఆర్వోలు, ఆర్ఐ, ఇతరత్ర అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. కావున ఎవ్వరు తహసీల్దార్ కార్యాలయం దగ్గర ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు. గోనెగండ్ల మండలంలో ఎన్నికల జరుగుతున్న గ్రామాలలో ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

పీజీ స్పాట్ అడ్మిషన్ లను వెంటనే నిర్వహించాలి



గోనెగండ్ల, నవంబరు 14, ప్రభాతవార్త :

రాయలసీమ విశ్వవిద్యాలయం లో పీజీ స్పాట్ అడ్మిషన్లను వెంటనే నిర్వహించారు. బీవీఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ నాయుడు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ రాయల సీమ విశ్వవిద్యాలయంలో పీజీ కోర్సులకు సంబంధించి అనే సీట్లు ఖాళీగా ఉన్నాయని వాటికి స్పాట్ అడ్మిషను వెంటనే చేపట్టాలని కోరార . అడ్మిషన్లు చేపట్టక పోవడం వల్ల విద్యార్థుల భవిష్యత్ పై తీవ్రప్రభావం చూపుతుందన్నారు. ఉన్నత చదువు చదవాలనే విద్యార్థుల ఆశయాలు నీరుగారిపోతున్నాయని ఆయన అన్నారు. పేద మధ్యతరగతి విద్యార్థులకు ఈ కోర్సులే ప్రదానం అన్నారు. కావున విశ్వవిద్యాలయం అధికారులు తక్షణమే స్పాట్ అడ్మిషన్లను ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమ ంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞానంతో పాటు వినయాన్ని అలవర్చుకోవాలి



తుగ్గలి,నవంబర్ 14,ప్రభాతవార్త:

విద్యార్థులు విజ్ఞానంతో పాటు వినయం, క్రమశిక్షణ అలవర్చుకున్నప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని నోవి స్కూల్ హెడ్మాస్టర్ తిప్పయ్య పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన తుగ్గలిలోని నోవి కాన్సెప్ట్ ఇంగ్లీష మీడియం పాఠశాల ఆవరణంలో భారత తొలి ప్రధాని పండింట్ జవహర్లాల్ నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళీలు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతు నేటి బాలలే రేపటి పౌరులని, చిన్ననాటి నుంచే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు పట్టుదలతో కృషి చేయాలన్నారు. విద్యారంగానికి బాలల అభ్యున్నతికి నెహ్రూ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జవహర్లాల్ నెహ్రూ జయంతి వేడుకలు



హొళగుంద, నవంబరు 14, ప్రభాతవార్త:

మండలకేంద్రమైన హొళగుందలోని శ్రీ బాపూజీ ఇంగ్లిష్ మీడియం అప్పర్ ప్రైమరీ స్కూల్లో శనివారం ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించారు. ముందుగా కరస్పాండెంట్ లక్ష్మన్న మాట్లాడుతూ పండిత్ జవహర్లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెహ్రూ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ప్రతిఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చంద్రావతి, ఉపాధ్యాయులు అనీషా, హబీబా, నస్రిన్, సౌజన్య, ఫాతిమా, సౌభాగ్య, పార్వతి, సానియా, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరలో సహకార సంఘాలకు ఎన్నికలు

– హొళగుంద వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షులు పి.విష్ణువర్ధన్రెడ్డి

హొళగుంద, నవంబరు 14, ప్రభాతవార్త:

త్వరలో సహకార సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని హొళగుంద వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షులు పి.విష్ణువర్ధన్రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సంఘంలో సభ్యత్వం ఉండి ఈ-కేవైసీ ఇప్పటివరకు చేయించుకోని వారు ఆధార్, పొలం పాసు పుస్తకం, ఆధార్ లింక్ అయిన ఫోన్ నంబర్తో సంఘం కార్యాలయంకు వెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలని కోరారు. అలాగే సంఘంలో రుణాలు పొంది సకాలంలో వడ్డీ లేదా కంతు కట్టని వారికి ఓటుహక్కు మరియు పోటీ చేసే హక్కు ఉండదన్నారు. కావునా వెంటనే వడ్డీ లేదా కంతు కట్టి ఓటు హక్కు పొందాలని సూచించారు.

డిసెంబర్ 1న ఛలో ఢిల్లీ జయప్రదం చేయండి



నందికొట్కూరు,నవంబర్ 14,ప్రభాతవార్త: కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతు డిసెంబర్ 1న చేపట్టే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపు నిచ్చారు. శనివారం జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం, పట్టణ కార్యదర్శి టి.గోపాలకృష్ణ, పట్టణ అధ్యక్షులు ఉస్మాన్ మాట్లాడుతు కేంద్ర కమిటీ పిలుపు మేరకు స్కీం వర్కర్లు, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, వివిధ స్కీమ్ వర్కర్లుగా పని చేసే వారు పాల్గొనాలని తెలిపారు. స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.42 వేలు ఇవ్వాలని, రిటైర్డ్ అయిన కార్మికులకు కనీస పెన్సన్ రూ.21 వేలు, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని కార్మీలకు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

నెట్ జీరో-హెల్తీ క్యాంపస్ హెల్త్ క్యాంప్లో ఏపి మోడల్ విద్యార్థుల ప్రతిభ



రుద్రవరం,నవంబర్ 14,ప్రభాతవార్త: నెట్జీరో-హెల్త్ క్యాంపస్, హెల్త్ క్యాంపుల కార్యక్రమాల్లో ఏపి మోడల్ స్కూల్ రుద్రవరం విద్యార్థుల విశేష ప్రతిభ కనపరిచారు. శనివారం జరిగిన కార్యక్రమానికి జిల్లా జి.సి.డి.ఓ జ్యోతి, హార్ట్పుల్ ఫౌండేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ నవీన్, క్లస్టర్ ఇన్చార్జీ రాజశేఖర్, సుబ్బన్న, ప్రసాద్రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులను అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. భవిషత్తులో మరింత ఉత్సాహంగా భాధ్యతాయుతంగా పాల్గొనాలని తెలిపారు. నెట్జీరో-హెల్తీక్యాంపస్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. విద్యార్థులను పర్యావరణ పరిరక్షణ ఆరోగ్య కార్యక్రమాలు, పచ్చదనం, పరిశుభ్రత వంటి అంశాల్లో చురుకైనా భాగస్వాములుగా తీర్చిదిద్దేందుకు పాఠశాల నిరంతరం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వందవాగిలిలో బాలల హక్కుల వారోత్సవాలు



హొళగుంద, నవంబరు 14, ప్రభాతవార్త: మండలంలోని వందవాగిలి గ్రామంలో ఎం.వి.ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంవీ ఫౌండేషన్ మండల కో ఆర్డినేటర్ సేవా నాయక్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని, బాల్యవివాహాలను పూర్తిగా వ్యతిరేకించాలని, ప్రతి బాలబాలికకు విద్య, సమాన హక్కులు, రక్షణ కల్పించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. బాలల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు కబడ్డీ, ఖోఖో, మ్యూజికల్ చైర్, డ్రాయింగ్ పోటీలు, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీల నిర్వహణకు దాతలుగా సత్యనారాయణ, మాజీ సర్పంచ్ శేషప్ప, మాజీ ఎంపీటీసీ నాగప్పలు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ మండల కో ఆర్డినేటర్ సేవానాయక్, ఫౌండేషన్ ఆర్గనైజర్ విజయ్, రెమిడియల్ టీచర్ సుష్మ, గ్రామపెద్దలు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పగిడ్యాల గ్రంథాలయంలో నెహ్రూజయంతి వేడుకలు



పగిడ్యాల, నవంబరు 14,ప్రభాతవార్త

పగిడ్యాలో 59వ జాతీయగ్రంథాలయ దినోత్సవాలు 14వతేదీ నుండి 20వతేదీ వరకు నిర్వహిస్తున్నామనీగ్రంథాలయ అధికారిణి కే.మద్దమ్మ తెలిపారు. శనివారం స్థానిక గ్రంథాలయంలో జవహర్లాల్ నెహ్రూనగర్ జయంతి బాలలదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళ్ళుఅర్పించారు. గ్రంథాలయ అధికారిణి కే.మద్దమ్మ మాట్లాడుతూ భారతదేశానికి ప్రథమ ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ అన్నారు. భారతదేశాన్ని ముందుకు అన్నిరంగాలలో నడిపించారన్నారు. నెహ్రూకు పిల్లలు అంటే చాలా ఇష్టమని అందుకే ఆయన పుట్టినరోజును బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామనీ గ్రంథాలయ అధికారిణి కే.మద్దమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక ఎంఈఓ కార్యాలయంలో జవహర్లాల్ నెహ్రూ జయంతి : స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలోశనివారం జవహర్లాల్ నెహ్రూ జయంతి ఘనంగా జరుపుకున్నారు. మండల విద్యాశాఖాధికారులు పి.సుభాన్, మురళీమోహన్రెడ్డిలు జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళ్ళుఅర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్లు

– ఎంపీడీఓ మద్దిలేటిస్వామి

ఆలూరు, నవంబరు 14, ప్రభాతవార్త:



స్థానిక సంస్థ ఎన్నికల్లో భాగంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలకు ఆదివారం నుంచి నామినేషన్లు స్వీరిస్తారని ఆలూరు ఎంపీడీఓ మద్దిలేటిస్వామి శనివారం విలేకరులకు తెలిపారు. ఆలూరు మండలంలోని 16 గ్రామ పంఆయతీలు ఉన్నాయని తెలిపారు. ఆలూరు, ముద్దనగేరి, మొలగవల్ల, అరికెర, హత్తిబెళగల్, కమ్మరచేడు, పెద్దహోతూరు, మనేకుర్తి గ్రామాల్లో నామినేషన్ల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సర్పంచ్ అభ్యర్థులు రూ.1500 నామినేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే జనరల్ కేటగిరీలో పోటీ చేసే అభ్యర్థులు రూ.3 వేలు నామినేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వార్డు సభ్యులు రూ.500 నామినేషన్ల ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసే అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్కార్డు, రేషన్కార్డు, పాన్కార్డు, ఆస్తి వివరాలు తప్పనిసరిగా నామినేషన్ పత్రాలతో పాటు జత పరచాలని సూచించారు.

సీపీఎం బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించండి

– ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడే అభ్యర్థులకే పట్టం కట్టాలి



ఆలూరు, నవంబరు 14, ప్రభాతవార్త:

ప్రజలకు సమస్యలు ఎదురైనప్పుడు ఎర్రజెండా మాత్రమే గుర్తుకు వస్తుందని, ప్రజా సమస్యలనే తమ సమస్యలుగా భావించి పరిష్కారమయ్యే వరకూ పోరాటం చేసే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.డి.అంజిబాబు, ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, సీనియర్ నాయకులు కె.నారాయణస్వామి కోరారు. శనివారం ఆలూరులోని జ్యోతిబసు భవన్లో ఏర్పాటు చేసిన ముఖ్య పార్టీ సభ్యుల సమావేశం నిర్వహించారు. స్థానిక సమస్యలపై ముందుండి పోరాడి ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న ఎర్రజెండా అభ్యర్థులను గెలిపిస్తే నిత్యం ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని అధికారులు, పాలకుల చేత సమస్య పరిష్కారమయ్యేంతవరకు అండగా ఉంటారని తెలిపారు. సర్పంచ్లుగా, వార్డు మెంబర్లుగా పోటీ చేస్తున్న సీపీఎం బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు షాకీర్, వెంకటేష్, కృష్ణ, మైన, షేకున్బీ, గోవర్ధన్, ఈరన్న, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తుకు నిర్మాతలు..

– ఘనంగా చాచా నెహ్రూ జన్మదిన వేడుకలు..



కోసిగి, నవంబరు 14, ప్రభాతవార్త :

నేటి బాలలే రేపటి దేశ భవిషత్తుకు నిర్మాతలని, దేశ భవిష్యత్తును నిర్దేశిస్తారని పలువురు ఉపాధ్యాయులు అన్నారు.. చాచా నెహ్రూ పుట్టిన రోజు సందర్భంగా శనివారం బాలల దినోత్సవాన్ని కోసిగిలోని పలు పాఠశాలలోని బాల బాలికల మధ్య ఘనంగా నిర్వహించారు..ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల, శ్రీ చౌడేశ్వరీ పాఠశాల, శ్రీ చైతన్య ఇంగ్లీసు మీడియం పాఠశాలలతో పాటు పలు చోట్ల బాలల దినోత్సవ వేడులకను జరుపుకున్నారు..ఈ సందర్భంగా చౌడేశ్వరీ పాఠశాలలో బాలబాలికలు జవహర్లాల్ నెహ్రూ చిత్ర పటానికి గులాబి పువ్వులతో పూల మాలలు వేసి ఆయనకు నివాళ్లలర్పించారు..అనంతరం జరిగిన బాలల వేడుకల్లో ఉపాధ్యాయులు మాట్లాడుతూ భారత దేశానికి తొలి ప్రధాని మంత్రిగా పనిచేసిన జవహర్లాల్ నెహ్రూలకు బాలలంటే ఎంతో ప్రేమ ఉందన్నారు..సున్నితమైన మనస్సు ఉన్న బాలలు గులాబి పువ్వులాంటి వారని, అందుకే నెహ్రూ ధరించే దుస్తులపై ఎప్పుడు కూడా గులాబి పుష్పం ఉంటుందన్నారు..అంతేకాక దేశానికి ఎనలేని సేవలను అందించి దేశాన్ని ఎంతో ముందుకు తీసుకెళ్లాడన్నారు.. ప్రపంచ పటంలో భారతదేశానికి ప్రత్యేక స్థానం కల్పించిన ఘనత నెహ్రూకే దక్కుతుందన్నారు..చిన్న పిల్లలంటే ఎంతో ముద్దుగా పిలిచేవాడని, ఎప్పుడు కూడా నేటి బాలలే రేపటి పౌరులని నినాదాలు చేసేవాడన్నారు..అనంతరం పిల్లలకు మిఠాయిలు, బిస్కట్లు, చాక్లెట్లు పంపిణి చేసారు.

ఘనంగా 59వ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



నందికొట్కూరు,నవంబర్ 14,ప్రభాతవార్త: ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు జరిగే జాతీయ వారోత్సవాలు పట్టణంలోని గ్రంథాలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వర్గీయ మాజీ ప్రధాని నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళీలు అర్పించారు. అనంతరం గ్రంథాలయాధికారి మురళీధర్ మాట్లాడుతు వారోత్సవాలలో భాగంగా 15న పుస్తకప్రదర్శన, 16న గ్రంథాలయ స్వాతంత్ర ఉద్యమకారులను స్మరించడం, 17న విద్యార్థిని,విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, 18న గ్రంథాలయాల ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు, 19న మహిళా దినోత్సవం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినీలకు వ్యాసరచన పోటీలు, 20న విజేతలకు బహుమతుల ప్రధానం, ముగింపు వేడుకలు నిర్వహించబడుతాయని ఆయన తెలిపారు.

రుద్రవరం ఓకటవ ఎంఈఓగా కృష్ణమూర్తి భాధ్యతలు

రుద్రవరం,నవంబర్ 14,ప్రభాతవార్త:



మండల విద్యాశాఖ ఒకటవ మండల విద్యాధికారిగా కె.కృష్ణమూర్తి శనివారం భాధ్యతలు చేపట్టారు. జిల్లా కేంద్రమైనా నంద్యాలలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్ నందు ఆసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ గా విధులు నిర్వహిస్తున్న కృష్ణమూర్తిని విద్యాశాఖ ఉన్నతాధికారులు రుద్రవరం ఎంఈఓ నియమితుల య్యారు. శనివారం ఎంపిడివో భాగ్యలక్ష్మిని కలిసి జాయినింగ్ ఉత్తర్వును అందజేసి భాధ్యతలు చేపట్టారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతు మండలంలో విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

03 page 14_03 page 14.qxd 11/14/2026 10:38 PM Page 1

ఘనంగా ప్రారంభమైన.. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

గడివేముల, నవంబరు 14, ప్రభాతవార్త:

మండలకేంద్రమైన గడివేములలోని శాఖ గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రంథాలయ అధికారి వి.వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాల హెచ్ఎం రాఘవేంద్ర, గడివేముల జిల్లా పరిషత్ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, తలముడిపి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు మహబూబ్‌బాషా, శ్రీ రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మల్లికార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రంథాలయ ప్రాధాన్యత గురించి, గ్రంథాలయ



వారోత్సవాల విశిష్టత గురించి వివరించారు. విలువలతో కూడిన విద్యను అందించడంలో గ్రంథాలయాల పాత్రను తెలియజేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్ వాడకం తగ్గించి పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానాన్ని పొందాలని సూచించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బట్టి విద్యను అర్థించడం కన్నా అర్థం చేసుకుని చదివితే చదువు ఎప్పటికైనా గుర్తుంటుందని తెలియజేశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతంగా రాణించాలని, గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామ ప్రజలు, పాఠకులు పాల్గొన్నారు.

ఘనంగా నెహ్రూ జయంతి నీ జరుపుకున్న పెన్షనర్లు



డోన్ నవంబర్ 14 ప్రభాతవార్త :

భారతదేశ తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ జయంతిని అదేవిధంగా బాలల దినోత్సవాన్ని ఘనంగా శనివారం డోన్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షన్స్ కార్యాలయంలో జరుపుకున్నారు ఈ కార్యక్రమానీ ఉద్దేశించి అధ్యక్షులు బాన్ సింగ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 14న బాలల దినోత్సవం తో పాటు దేశ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ గారి జయంతిని ఘనంగా జరుపుకోవడం జరుగుతుందని బాను సింగ్ అన్నారు అదేవిధంగా పిల్లలు అంటే నెహ్రూ గారికి ఎంతో ఇష్టమని అందుకే ఆయనను పిల్లలు ప్రేమగా చాచా నెహ్రు అని పిలిచేవారు అన్నారు అదేవిధంగా ప్రతి చిన్నారి దేశ భవిష్యత్తుకు పునాది పిల్లలే రేపటి భారతదేశానికి ఆశా కిరణాలు పిల్లలే మంచి విద్య ఆరోగ్యం ప్రేమ ఆప్యాయత అందించడానికి తల్లిదండ్రులు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు అదేవిధంగా పిల్లల కలలను ప్రోత్సహించి వారి ప్రతిభను వెలకతీయడానికి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో గాలయ్య గోపాల్ సుబ్బరాయుడు నరసింహులు రామకృష్ణారెడ్డి లక్ష్మయ్య మాజిక్యం శెట్టి హుస్సేన్ సాహెబ్ దాసప్ప ఎన్ ఎస్ బాబు రాందాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు దశాబ్దాల పార్టీ సేవకు గుర్తింపుగా చూడి ఉలిగయ్యకు జడ్పీ చైర్మన్ పదవి కల్పించాలి

కౌతాళం, నవంబర్ 14, ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీకి నాలుగు దశాబ్దాలుగా విశేష సేవలందిస్తున్న సీనియర్ నాయకుడు చూడి ఉలిగయ్యకు కర్నూలు జిల్లా జడ్పీ చైర్మన్ పదవి కేటాయించాలని కౌతాళం టౌన్ ఎంపీటీసీ3 లింగేష్ కోరారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా పార్టీని వీడకుండా, ఎలాంటి పదవులు ఆశించకుండా ప్రజాసేవలో కొనసాగుతున్న నాయకుడని కొనియాడారు. మంత్రాలయం నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజలు, కార్యకర్తలు ఆయనకు జడ్పీ చైర్మన్ పదవి ఇవ్వాలని కోరుకుంటున్నారని తెలిపారు. గతంలో ఎమ్మెల్యే టికెట్ ఆశించినప్పటికీ దక్కకపోయినా నిరంతరం పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 22 ఎంపీటీసీ స్థానాలకు గాను 20 స్థానాలను టీడీపీ గెలుచుకోవడంతో పాటు, జడ్పీటీసీ స్థానాన్ని 9,102 ఓట్ల మెజారిటీతో కైవసం చేసుకోవడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఎంతోమంది కార్యకర్తలను, నాయకులను తీర్చిదిద్దిన ఉలిగయ్య సేవలను గుర్తించి ఈసారి జడ్పీ చైర్మన్ పదవి కేటాయించాలని పార్టీ అధిష్ఠానాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎరిగేరి నబీసాబ్, కుంభర నాగరాజు, కాకము శ్రీరామ్, మంగలి మధు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కొలనుభారతి క్షేత్రంలో సామూహిక అక్షరాభ్యాసాలు



కొత్తపల్లి, నవంబర్ 14, ప్రభాతవార్తః రాష్ట్రంలో ఏకైక సరస్వతి ఆలయంగా పేరుగాంచిన కొలను భారతి క్షేత్రంలో కార్తీక మాసం శనివారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు కొలను భారతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి చారఘోషిణి నది జలాలతో జలాభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి అమ్మవారిని దర్శించుకొని కాయ కరూ ్పరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సప్త శివాలయాలను దర్శించుకొని చిన్నారులకు వారి తల్లిదండ్రులు, ఆలయ అర్చకుల సమక్షంలో బీజాక్షరాలు దిద్దించి 26 మంది చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు.

ఆంగ్లభాషలో నైపుణ్యం పెంచుకోవాలి..

- విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఆంగ్ల బోధన చేయాలి

- శిక్షకురాలు గౌతమి పిలుపు

ఆదోనిటౌన్, నవంబరు 14, ప్రభాతవార్త:

ఆంగ్లభాషలో నైపుణ్యం పెంచుకోవాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఆంగ్ల బోధన చేయాలని శిక్షకురాలు గౌతమి పిలుపునిచ్చారు. శనివారం విద్యార్థులు ఆంగ్ల భాషలో నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ఉపాధ్యాయుల్లో ఆంగ్లంలో మాట్లాడే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఆదోనిలోని ఆల్ఫా ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో స్పోకెన్ ఇంగ్లిష్ డెవలప్‌మెంట్ వర్క్‌షాపును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య శిక్షకురాలిగా కె.గౌతమి (జువాలజీ లెక్చరర్, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ అండ్ మాస్టర్ మోటివేటర్) పాల్గొని ఉపాధ్యాయులకు పలు సూచనలు తెలియజేశారు. ఉపాధ్యాయులకు ఆంగ్లభాష అభివృద్ధిపై విలువైన శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆంగ్ల భాషపై పట్టు సాధించడం ఎంతో అవసరమని, కేవలం ఆంగ్ల వ్యాకరణం నేర్చుకోవడమే కాకుండా నిత్య జీవితంలో ఆంగ్లంలో ధైర్యంగా, స్పష్టంగా మాట్లాడే నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. వర్క్‌షాప్‌లో భాగంగా తరగతి గదిలో ఉపయోగించాల్సిన ఆంగ్ల పదజాలం, ఉపాధ్యాయులు విద్యార్థులకు ఇచ్చే సూచనలు, రోజువారీ సంభాషణలు, సరైన మరియు తప్పు వాక్య నిర్మాణాలు, ఉచ్చారణ, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి అంశాలపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. వివిధ యాక్టివిటీస్, గ్రూప్ డిస్కషన్స్, రోల్ ప్లేలు, వర్క్‌షీట్ల ద్వారా ఉపాధ్యాయుల్లో ఆంగ్లంలో మాట్లాడే ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే ప్రయత్నం చేశారు. ఉపాధ్యాయులు మారితే తరగతి గది మారుతుందని, తరగతి గది మారితే విద్యార్థుల భవిష్యత్ మారుతుందనే సందేశాన్నిచ్చారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రిన్సిపాల్ అబ్దుల్‌రహమాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

పరమేష్ ను పరామర్శించిన తిరివీధి కుటుంబీకులు



వెల్దుర్తి,నవంబర్14, ప్రభాతవార్త :

పట్టణంలోని 1వ వార్డులో నివాసం ఉంటున్న ఐరన్‌ఓర్ వ్యాపారవేత్త పరమేష్ అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న పారిశ్రామికవేత్తలు తిరివీధి కుటుంబీకులు శనివారం అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. పరమేష్ కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని వారు తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే తమకు తెలపాలని పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త,వెల్దుర్తి సర్పంచ్ అభ్యర్థి తిరివీధి రమేష్, డాక్టర్.టి. రాంప్రసాద్, పారిశ్రామికవేత్తలు టి. వంశీధర్, టి. సుధీంద్ర, టి. శివయ్య తదితరులు పాల్గొన్నారు

ఘనంగా జవహర్‌లాల్ నెహ్రు జయంతి వేడుకలు



పాములపాడు, నవంబర్ 14, ప్రభాతవార్తః

పాములపాడు శాఖ గ్రంథాలయం నందు 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా భారతదేశ తొలి ప్రధాని స్వర్గీయ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు గ్రంథాలయ అధికారి సీవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల వైద్యాధికారిని నాగలక్ష్మిదేవి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. నాగలక్ష్మిదేవి, కృష్ణారెడ్డిలు మాట్లాడుతూ జవహర్ లాల్ నెహ్రూను చాచ నెహ్రూ అని కూడ పిలుస్తారని బాలల అంటే ఆయనకు ఎంతో ప్రేమ అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని చెప్పిన మొదటి వ్యక్తి నెహ్రూనే అన్నారు. గ్రంథాలయాల్లో ఎంతో విజ్ఞానం ఉంటుందని బాల బాలికలు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో పాఠకులు రవీంద్రయాదవ్, పరమేష్, నాగేశ్వర్‌రావు, చంద్రుడు, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



కొత్తపల్లి, నవంబర్ 14, ప్రభాతవార్తః ఒక మంచి పుస్తకం వంద మంది మిత్రులతో సమానమని, గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని కొత్తపల్లి గ్రంథాలయ శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆయన శనివారం స్థానిక గ్రంథాలయంలో 59వ గ్రంథాలయ వారోత్సవ కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 14 బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రంథాలయ వారోత్సవ వేడుకల్లో భాగంగా ఈనెల 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారుల స్మరణ, 17, 18 తేదిల్లో వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన, వక్తృత్వ పోటీలు, 19న జాతీయ మహిళా దినోత్సవం నిర్వహన, 20న వారోత్సవ ముగింపు కార్య క్రమం ఉంటుందని అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.

ఘనంగా ఆళ్లగడ్డలో బాలల దినోత్సవం



ఆళ్లగడ్డ, నవంబర్ 14, ప్రభాతవార్తః

స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి ప్రధాని పండింట్ జవహర్ లాల్ నెహ్రూ 137వ జయంతిని పురస్కరించుకొని శనివారం ఆళ్లగడ్డ పాలసాగరం రోడ్డులోని ప్రభుత్వ బాలుర సాంఘీక వసతి గృహంలో బాలల దినోత్సవాన్ని హాస్టల్ వేల్ఫేర్ ఖాదర్ ఉశేన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా అపుస్మా ఆళ్లగడ్డ యూనిట్ అధ్యక్షుడు అమీర్ బాషా హాజరయి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పండింట్ జవహర్‌లాల్ నె హ్రూ స్వాతంత్ర సమరయోధుడిగా, భారతదేశ తొలి ప్రధానిగా నవభారత నిర్మాతగా భారతీయుల గుండెల్లో చిరస్మరణియుడన్నారు. ఆయన దేశానికి చేసిన మహోన్నత సేవలు అదర్శనీయమన్నారు. బాలల పోషకాహారలోప నివారణకు ఉచిత పాలు, ఆహారం అందించిన ఘనత నెహ్రూకే దక్కుతుందన్నారు. అంతర్జాతీయరంగరంలో నెహ్రూ శాంతిదూతగా ఖ్యాతి పొందారన్నారు.

ఘనంగా ప్రారంభమైన గ్రందాలయ వారోత్సవాలు

కోవెలకుంట్ల, నవంబరు 14,ప్రభాతవార్త

కోవెలకుంట్ల పట్టణంలోని గ్రందాయంలో 59వ గ్రందాలాయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఇందులో బాగంగా అదికారి బాలతిమ్మారెడ్డి నెహ్రూరు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు.



జిల్లా పరిషత్ చైర్మన్ స్థానాన్ని వాల్మీకులకు కేటాయించాలి



కోడుమూరు,నవంబర్ 14,ప్రభాతవార్త ః కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ స్థానాన్ని వాల్మీకులకు కేటాయించాలని కోడుమూరు మండల వాల్మీకి సంఘం జాతీయ ఐక్య వాల్మీకి పోరాట సమితి ప్రధాన కార్యదర్శి బోయ బలరామ్ కోరారు. పరిషత్ ఎన్నికలల్లో కర్నూలు జిల్లా కౌతాలం మండల జడ్పీటీసీ స్థానంకు టీడీపీ నుంచి బరిలో దిగిన ఉలిగయ్య ప్రత్యర్థి పార్టీని చిత్తు చేసి భారీ మెజార్టీ సాధించారన్నారు. ఉలగయ్య టీడీపీ పార్టీకి ఎంతో కాలం నుంచి పనిచేస్తూ వస్తున్నారన్నారు. అంతే గాక గడవిన అసెంబ్లీ,ఎంపి స్థానాలకు పోటీ చేసిన అభ్యర్థుల విజయాలకు ఉలగయ్య ఎంతో శ్రమించారని గుర్తు చేశారు. పార్టీ మనుగడ కోసం అలుపెరగకుండా పని చేసిన సినియర్ నాయకులను టీడీపీ అధిష్టానం గుర్తించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. జిల్లా పరిషత్‌కు ఇంత వరకు చైర్మన్ స్థానాన్ని గడచిన పాలక ప్రభుత్వాలు వాల్మీకులను గుర్తించలేదన్నారు. అందుకే ప్రస్తుత కూటమి ప్రభుత్వ ముఖ్యమ ంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 20వ తేదిన జరిగే జిల్లా పరిషత్ చైర్మన్ స్థానాన్ని వాల్మీకులకు అవకాశం కల్పించాలని ఆయన కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నేటి నుండి ఫర్టిలైజర్ అప్టికేషన్‌అప్ ద్వారా ఎరువుల విక్రయాలు

నంద్యాల, నవంబరు 14,ప్రాతవార్తప్రతినిధి :



నంద్యాల మండలంలోని నేటి నుండి ప్రెమ్ వర్క్ ఫర్ ఫర్టిలైజరు సేల్ అప్టికేషన్ అప్‌ద్వారా ఎరువుల విక్రయాలు చేపడుతున్నట్లు ఎఒ ప్రసాదారావు చెప్పారు. ఈసందర్భముగా అయన మాట్లాడుతూ ఇప్పటినుండి రైతులు వారికి కావల్సిన ఎరువులను వారు సాగు చేసిన పంటలకు అనుగుణంగా యప్‌యప్‌యస్ అప్ నందు బుక్ చేసుకోగలరని అలాగే వారికి దగ్గరలోని డీలర్స్‌ను ఎంపిక చేసుకుని క్యూఆర్ కోడ్ ద్వారా ఎరువులను కొనుగోలు చేయవచ్చని తెలిపారు. ఈ యఫ్‌యఫ్‌యస్ అప్ ద్వారా నే ఎరువులను ఇప్పటినుండి ప్రవేటు డీలర్స్ మరియు రైతుసేవా కేంద్రాల ద్వారా విక్రయాలు చేయబడునని చెప్పారు. కావున ఈఅప్ ద్వారా ఎరువులను మరింత సులభంగా పారదర్శకంగా పంపిణీ చేయుటకు ఉయోగపడుతుందన్నారు. అలాగే ఈఅప్ గురించి రైతులు పూర్తి అవగామణ పొందే వరకు ప్రతి డీలర్ దుఖాణం నవందు సహాయ కేంద్రం ఏర్పాటు చేయబడునిని అలాగే రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకుసహాయపడుదురని చెప్పారు.

ప్రశాంతంగా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



గూడూరు,నవంబర్ 14,ప్రభాతవార్త ః కోడుమూరు పోలీస్ సర్కిల్ పరిధిలో జరిగే పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని కోడుమూరు సి.ఐ తబ్రేజ్ సూచించారు. శనివారం సర్కిల్ పరిధిలోని గూడూరు మండలం గుడిపాడు గ్రామంలో స్పెషల్ బెటాలియన్ సిబ్బందితో కాసో ఆపరేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ ఎన్నికలు ముగిసే వరకు ఎక్కడా కూడా కొత్తవారిని గ్రామంలోకి రానివ్వకూడదని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. అదే విధంగా గ్రామంలో అనుమానం ఉన్న ఇళ్లను సోదాలు చేశారు. అంతే గాక గుర్తింపు లేని వాహనాలు ఉంటే కూడా వాటిని సీజ్ చేస్తామని సి.ఐ హెచ్చరించారు. పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు తమ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఎన్నికల సమయంలో ఎవరైన ఓటర్లను బెదిరింపులకు,అల్లర్లకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎస్.ఐ రాజాకుళ్లాయప్పలు కూడా ఉన్నారు.

ఆంజనేయ స్వామి భక్తులకు అన్నదానం ఏర్పాటు



వెల్దుర్తి,నవంబర్14,ప్రభాతవార్త :

వెల్దుర్తి పట్టణంలోని స్థానిక పసుల దేవాలయం నందు శనివారం వెల్దుర్తి సర్పంచ్ అభ్యర్థి తిరివీధిరమేష్ శెట్టి ఆంజనేయస్వామిలకు బిక్ష ఏర్పాటు చేశారు.అనంతరం బిక్ష స్వాములకు వడ్డిచడం జరిగినది, ఈ కార్యక్రమంలో, వంశిశెట్టి , రాము ప్రసాద్ శెట్టి, సురేందర్ శెట్టి, ఈ కార్యక్రమంలో గురు స్వాములు చిరంజీవిస్వామి, తెలుగు మధుస్వామి, బాలుస్వామి, రామాంజనేయ స్వామి, తదితరులు పాల్గొన్నారు

రైతులు ఈ-కేవైసీ తప్పకుండా చేసుకోవాలి

- సీఈఓలు తెర్నెకల్ ఖాజాహుసేన్, వెంకటేష్



మంత్రాలయం, నవంబరు 14, ప్రభాతవార్త:

మండలంలోని మంచాల, కల్లుదేవకుంట సహకార సంఘాల్లో ఖాతా ఉన్న ప్రతి రైతు ఈ-కేవైసీ తప్పకుండా చేసుకోవాలని సీఈఓలు తెర్నెకల్ ఖాజాహుసేన్, వెంకటేష్‌లు రైతులను కోరారు. శనివారం వారు మాట్లాడుతూ జనవరి నెలలో సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధపడుతున్న నేపథ్యంలో రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. అదేవిధంగా రుణాలు, బకాయి ఉన్న రైతులు రుణాలను చెల్లించాలన్నారు. రుణాలు చెల్లించని పక్షంలో వారికి ఓటుహక్కు ఉండదన్నారు. కావునా రైతులు అందరూ ఈ విషయాలు గుర్తించుకోవాలన్నారు.

యువతిని బెదిరింపుతో కేసు నమోదు

కొలిమిగుండ్ల, నవంబర్ 14, ప్రభాతవార్తః

కొలిమిగుండ్ల మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెలో శనివారం గ్రామానికి చెందిన ఒక యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన పండ్ల బ్రహ్మతేజ అనే వ్యక్తి ప్రేమ పేరుతో వేధిస్తు వ్యక్తిగత ఫోటోలతో బెదిరిస్తున్నారని తనకు వివాహం నిశ్చయమైన నేపధ్యంలో కాబోయే వరుడి కుటుంబ సభ్యులకు తన వ్యక్తిగత ఫోటోలు చూపించి వివాహానికి ఆటంకం కలిగించే ప్రయత్నం చేశారని అంతే కాక ఇన్‌స్ట్రాగ్రామ్ ద్వారా బెదిరిస్తున్నారని యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పండ్ల బ్రహ్మతేజ, అతని తండ్రి, మరో వ్యక్తిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈసందర్భంగా సిఐ రమేష్‌బాబు మాట్లాడుతూ కొలిమిగుండ్ల మండల పరిధిలో మహిళల పట్ల అసభ్యపరంగా ప్రవర్తించినా వేదింపులకు పాల్పడినా ఉపేక్షించేది లేదని బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్‌బాబు తెలిపారు.

వార్త CLASSIFIEDS వార్త
VAARTHA CLASSIFIEDS
TO LET OR RENT
★ కమర్షియల్ షాపులు అద్దెకు: PAV కాంప్లెక్స్ XX, RTC బస్టాండ్ దగ్గర, నంద్యాల - షాప్ 4 & 5, 200 SFT, ₹3500.
ఫోన్: 98458 55438
(Ro.No.33318)
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

04 page 14_04 page 14.qxd 11/14/2026 10:38 PM Page 1

జాతీయ స్థాయిలో 7వ నేషనల్ వాటర్ అవార్డు సాధనే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలి

: నీటి సంరక్షణ, జల వనరుల అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రదర్శించాలి : జిల్లా కలెక్టర్

నంద్యాల, నవంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి :



జిల్లాలో నీటి సంరక్షణ, జల వనరుల అభివృద్ధి, భూగర్భ జలాల పరిరక్షణకు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను సమర్థవంతంగా వివరించి, 7వ జాతీయ జల అవార్డులు సాధించే దిశగా సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో 7వ జాతీయ జల అవార్డుల సాధనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాల్సిన ప్రతిపాదనలు, జిల్లాలో నీటి సంరక్షణ కోసం చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన ప్రగతిపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సెంట్రల్ వాటర్ కమిషన్ నుంచి వచ్చే బృందం జిల్లాలో చేపట్టిన నీటి సంరక్షణ, జల వనరుల అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ధ్రువీకరించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమాచారంతో, సమగ్ర నివేదికలు, ఆధారాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ నెల 17, 18 తేదీల్లో కేంద్ర బృందం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో బనగానపల్లి, ఔకు, కొలిమిగుండ్ల తదితర ప్రాంతాల్లో పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జల వనరుల శాఖ, డ్వామా ఆధ్వర్యంలో చేపట్టిన నీటి సంరక్షణ పనులు, పండ్ల తోటలు, మొక్కల పెంపకం, పాఠశాలలు, గ్రామ పంచాయతీలు, ఆసుపత్రుల్లో పచ్చదనం పెంపునకు చేపట్టిన కార్యక్రమాలను బృందానికి వివరించాలని కలెక్టర్ ఆదేశించారు.అదేవిధంగా రెండవ రోజు నంద్యాల పట్టణంలోని మురుగునీటి శుద్ధి కేంద్రం (ట్రీట్‌మెంట్ ప్లాంట్), పాణ్యం, బేతంచెర్ల, డోన్ మండలాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి, నీటి సంరక్షణ కార్యక్రమాలను కేంద్ర బృందం పరిశీలించనున్నట్లు తెలిపారు. మైక్రో ఇరిగేషన్, జల వనరులు, డ్వామా, పబ్లిక్ హెల్త్, గ్రౌండ్ వాటర్ తదితర శాఖలు తమ పరిధిలో అమలు చేసిన ఉత్తమ కార్యక్రమాలను గుర్తించి, వాటి ఫలితాలు, ప్రభావాన్ని స్పష్టమైన గణాంకాలు, ఫొటోలు, సంబంధిత రికార్డులతో సహా ప్రదర్శించాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చినప్పుడు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, జిల్లాలో సాధించిన ప్రగతిని సమర్థవంతంగా వివరించేలా నాణ్యమైన ప్రజెంటేషన్ సిద్ధం చేయాలని సూచించారు. జాతీయ స్థాయిలో నంద్యాల జిల్లాకు గుర్తింపు తీసుకువచ్చేలా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పనిచేసి, 7వ జాతీయ జల అవార్డు సాధనకు కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఆర్టీసీ సేవల్లో.. పారదర్శకతే లక్ష్యం

: ఆదోని డిపోలో విజిలెన్స్ ఏఎస్పీ వినోద్ కుమార్ ఆకస్మిక తనిఖీలు

ఆదోని 14 నవంబర్ ప్రభాతవార్త ప్రతినిధి:

కర్నూలు జిల్లా ఆదోని ఆర్టీసీ డిపోలో శనివారం ఏపీఎస్ ఆర్టీసీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం అధికారులు విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. స్టేట్ విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏఎస్పీ) కె.ఎస్. వినోద్ కుమార్ నేతృత్వంలో ఈ తనిఖీలు సాగాయి. ఈ బృందంలో ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్ఐలు రామకృష్ణ, మురళీకృష్ణలతో పాటు ఫైనాన్స్ ఏఎంటీ బృందం సభ్యులు పాల్గొన్నారు. డిపో పరిధిలోని పలు విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు, ప్రధానంగా ఎర్నింగ్స్ సెక్షన్‌లోని నగదు లావాదేవీలు, ఆయిల్ అవుట్‌లెట్‌లో నిల్వ ఉన్న డీజిల్, లూబ్రికెంట్ల స్టాక్ వివరాలను లెక్కలతో సరిపోల్చారు. సంస్థకు ఎక్కడా ఆర్థిక నష్టం కలగకుండా పక్కాగా రికార్డులు నిర్వహిస్తున్నారా లేదా అనే అంశాలను తనిఖీ చేశారు.వీటితోపాటు బస్టాండ్ ప్రాంగణ నిర్వహణ, వాణిజ్య దుకాణాలు, కార్గో సేవల పనితీరును పరిశీలిం చారు. ఈ తనిఖీల్లో ఎలాంటి లోపాలు లేదా ఆర్థిక అవకతవకలు వెలుగుచూడలేదని అధికారులు స్పష్టం చేశారు. గతంలో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఆర్థిక అవకతవకలు చోటుచేసుకున్న నేపథ్యంలోనే, ముందస్తు జాగ్రత్తగా రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్పీ వినోద్ కుమార్ మాట్లాడుతూ, ఆర్టీసీ సేవల్లో పారదర్శకత, నాణ్యతను మరింత పెంచడమే తమ తనిఖీల ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. ప్రయాణికులు ఆర్టీసీ సేవలపై ఏవైనా ఫిర్యాదులు, సలహాలు లేదా సూచనలు ఇవ్వాలనుకుంటే బస్టాండ్‌లో అందుబాటులో ఉంచిన ప్రాజెక్ట్ క్యూఆర్ కోడ్ ద్వారా నేరుగా విజయవాడలోని హెడ్‌క్వార్టర్స్‌కు తెలియజేయ వచ్చని ఆయన సూచించారు.



గుడుంబాయి తాండాలో నాటుసారా స్థావరాలపై దాడులు

: 300 లీటర్ల బెల్లం ఊట, 30 లీటర్ల నాటుసారా ధ్వంసం



కర్నూల్ హాస్పిటల్ నవంబర్ 14 ప్రభాతవార్త :

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అక్రమ కార్యకలాపాల నివారణకు ఓర్వకల్లు మండలం గుడుంబాయి తాండాలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటుసారా తయారీకి ఉపయోగించే 300 లీటర్ల బెల్లం ఊట, 30 లీటర్ల నాటుసారా, 15 కిలోల బెల్లం స్వాధీనం చేసుకుని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అనంతరం గ్రామస్తులకు నాటుసారా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించి, తయారీ, నిల్వ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఏఎస్ఈ రామకృష్ణారెడ్డి, సీఐలు చంద్రహాస్, రాజేంద్రప్రసాద్, కిషోర్, ఎస్ఐలు నవీన్, తేజ, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో 180 వరిగడ్డి కట్టలు ధగ్ధం

రుద్రవరం,నవంబర్ 14,ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఆర్.నాగలవరం గ్రామంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో 180 వరిగడ్డి కట్టలు దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన చౌడూరు లక్ష్మీ నరసింహులు అనే రైతుకు చెందిన వరిగడ్డి కట్టలు నిల్వ ఉంచారన్నారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ధూమపానం సేవించి అక్కడే పడి వేయడంతో మంటలు వ్యాపించి వరిగడ్డి కట్టలు దగ్ధమయ్యాయన్నారు. ఈ ప్రమాదంలో రైతుకు దాదాపు రూ.లక్ష రూపాయలు నష్టం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. అగ్ని ప్రమాదం తెలుసుకున్న ఆళ్లడ్డ అగ్నిమాపక దళ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

సుంకేశ్వరి గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్

– అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేపట్టిన పోలీసులు



మంత్రాలయం, నవంబరు 14, ప్రభాతవార్త:

మండలంలోని మాధవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతమైన సుంకేశ్వరి గ్రామంలో మంత్రాలయం సీఐ గిరిబాబు, మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్, మంత్రాలయం ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర ్భంగా సీఐ గిరిబాబు మాట్లాడుతూ వచ్చే సర్పంచ్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అల్లర్లు, గొడవలు జరగకుండా శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిపేలా పోలీసుశాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. అన్నివర్గాల ప్రజలు ఎన్నికలకు సహకరించాలన్నారు. ఎవరైనా అల్లర్లు, గొడవలు సృష్టిస్తే అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. ఎన్నికల రోజున పోలింగ్ బూత్‌ల వద్ద పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ మరియు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



బైక్ ప్రయాణంలో ప్రమాదం..మహిళ మృతి

తుగ్గలి,నవంబర్ 14,ప్రభాతవార్త:

బైక్ ప్రయాణంలో చోటు చేసుకున్న ప్రమాదం ఓ కుటుంబంలో విషాదం నింపింది. తుగ్గలి-రాతన మార్గంలో శనివారం ఈ ఘటన జరిగింది. పగిడిరాయి గ్రామానికి చెందిన మట్టి లలిత(35) భర్త గుండమయ్యతో కలిసి పత్తికొండ నుంచి స్వగ్రామానికి బైక్‌పై పగిడిరాయికి వెళుతుండగా ప్రమాదానికి గురైంది. ప్రయాణ సమయంలో ఆమె చీర బైక్ వెనుక చక్రానికి చుట్టుకోవడంతో అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది. ఈ ఘటనలో లలిత తలకు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు కోలుకోలేక మృతి చెందినట్లు సమాచారం. మృతురాలికి ఒక కుమారుడు, ఒక కుమార్తె కలరు. పోలీసులు విచారణ చేపట్టారు.



యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం..

: ప్రముఖ పారిశ్రామికవేత్త తిరువీధి వంశీధర్.. వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు..

వెల్దుర్తి, నవంబర్14, ప్రభాతవార్త :



యువతకు ఉపాధి కల్పించడమే నా ధ్యేయమని ప్రముఖ పారిశ్రామికవేత్త తిరువీధి వంశీధర్ అన్నారు. శనివారం వెల్దుర్తికి వచ్చిన ఆయన స్థానిక జర్నలిస్టు కాలనీలో వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు యార్లపాటి శ్రీధర్ శర్మ వారిచే ప్రత్యేక పూజ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన ఆలయానికి చేసిన సహాయం గుర్తించి ఆయనకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ గ్రామం నుండి పారిశ్రామికంగా ఉన్నత స్థితికి ఎదిగి ప్రభుత్వంతోనే ఎం వో యు చేసుకొని స్థాయికి వెళ్లినందుకు ఆయనను కొనియాడారు. అనంతరం మాలధారణ స్వాములందరూ కలిసి ఆయనకు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ నాకు ఈ గ్రామంలోని దేవుళ్ల ఆశీస్సులతో నేను ఈ స్థాయికి వెళ్లడం జరిగిందని అయితే ఈ గ్రామానికి ఏదైనా చేయాలని సంకల్పం ఉందన్నారు. ఈ గ్రామ శివార్లలో ఒక మంచి పరిశ్రమ ఏర్పాటు చేసి ఇక్కడ ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని లక్ష్యం ఉందని అన్నారు. ఈయన వెంట పారిశ్రామికవేత్త తిరువీధి సుధీంద్ర, ఆలయ కమిటీ సభ్యులు సుదర్శన్ రెడ్డి, గోపీనాథ్ నాయుడు, చిరంజీవి, మధు అలాగే గురు స్వాములు గౌండసూరి, చిరంజీవి, బోయ భాస్కర్ నాయుడు, రత్నపల్లి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

టీ దుకాణంలో భారీ చోరీ: రూ. 6 లక్షల నగదుతో దుండగుడు పరార్

ఆదోని, 14 నవంబర్ ప్రభాతవార్త ప్రతినిధి:

టీ కొట్టులోని డ్రాలో ఉంచిన రూ. 6 లక్షల నగదును గుర్తుతెలియని దుండగుడు అపహరించుకుపోయిన ఘటన ఆదోని మండల పరిధిలో కలకలం రేపింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని ఆరేకల్ గ్రామానికి చెందిన గొల్ల గంగిరెడ్డి (30), తండ్రి లేట్ గొల్ల బాలిరెడ్డి తన వద్ద ఉన్న రూ. 6,00,000/ నగదును ఒక కవరులో ఉంచాడు. అనంతరం ఆ నగదును నిమ్ముకన్నడ వద్ద తన బంధువైన గొల్ల చంద్రశేఖర్ నిర్వహిస్తున్న కంటైనర్ టీ దుకాణంలోని డ్రాలో భద్రపరిచాడు. తాను స్నానం చేసి వస్తానని చంద్రశేఖర్‌కు చెప్పి గంగిరెడ్డి అక్కడి నుండి ఇంటికి వెళ్లాడు. కాసేపటికే చంద్రశేఖర్ కూడా మోటార్ ఆన్ చేయడానికి బయటకు వెళ్లగా, దుకాణంలో ఎవరూ లేని సమయం చూసి టీ తాగేందుకు వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి డ్రాలో ఉన్న రూ. 6 లక్షల నగదు కవర్‌ను అపహరించాడు. అనంతరం తన వెంట తెచ్చుకున్న హోండా యూనికార్న్ మోటార్‌సైకిల్‌పై అక్కడి నుంచి వేగంగా పరారయ్యాడు. కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చిన బాధితులు డ్రా చూడగా నగదు కనిపించకపోవడంతో లబోదిబోమన్నారు. పరిసర ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో, రూ. 6 లక్షల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు గొల్ల గంగిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ఆదోని తాలూకా ఎస్సై తెలిపారు . సీసీటీవీ పుట్టేజి ఆధారంగా నిందితుడిని గుర్తించి, పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

కేసీ కెనాల్‌కు తక్షణమే సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోండి..

; మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పురుషోత్తం రెడ్డి

నంద్యాల నవంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి :



ప్రకృతి కరుణించక, సరిపడా వర్షాలు కురవక అల్లాడిపోతున్న అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే కేసీ కెనాల్‌కు సాగునీరు విడుదల చేయాలని, మంత్రి తక్షణమే స్పందించాలని రైతులు కోరుతున్నారు. నేడు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పురుషోత్తం రెడ్డితో పాటు పలువురు రైతులు కేసీ కెనాల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు తాము పడుతున్న ఇబ్బందులను, కష్టాలను అధికారుల ఎదుట ఏకరువు పెట్టారు. సాగునీరు సకాలంలో అందక తాము సాగు చేసిన పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ..ప్రస్తుతం వెలుగోడు రిజర్వాయర్‌లో 9.5 టీఎంసీల నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అందులో కేవలం ఒక్క టీఎంసీ నీటిని మాత్రమే కేసీ కెనాల్‌కు విడుదల చేస్తే, ఆయకట్టు కింద ఉన్న వేలాది ఎకరాల పంటలకు జీవం పోసినట్లవుతుందని కోరారు. ముఖ్యంగా జొన్న పంట సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో రెండు రోజుల్లోగా నీరు అందకపోతే పంట పూర్తిగా ఎండిపోయి, రైతులు కోలుకోలేని ఆర్థిక నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక మంత్రివర్యులు మరియు ప్రజాప్రతినిధులు స్పందించి, రైతుల కష్టాలను మానవతా దృక్పథంతో పరిశీలించాలని కోరారు. తక్షణమే సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి, కేసీ కెనాల్ ద్వారా సాగునీరు అందించి తమను ఆదుకోవాలని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. అన్నాదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన స్పందించాలని విజ్ఞప్తి చేశారు.



లాడ్జి, హోంస్టేలకు వచ్చే వారి వివరాలను సేకరించాలి

– మంత్రాలయం సీఐ గిరిబాబు



మంత్రాలయం, నవంబరు 14, ప్రభాతవార్త;

లాడ్జి, హోంస్టేలకు వచ్చే వారి వివరాలను సేకరించాలని మంత్రాలయం సీఐ గిరిబాబు నిర్వాహకులను ఆదేశించారు. శనివారం మంత్రాలయం సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో లాడ్జి మరియు హోం స్టే నిర్వాహకులకు స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతికిక్కరి పూర్తి వివరాలను తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. వారి ఆధార్‌కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాలను పరిశీలించి, వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు లాడ్జ్ లేదా హోం స్టేలో బస చేసినట్లు గుర్తించినా, అసాధారణ కార్యకలాపాలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆదేశించారు. పోలీసులకు సహకరించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుశాఖ కృషి చేస్తుందన్నారు.

ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన

– పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు

– మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్



మంత్రాలయం, నవంబరు 14, ప్రభాతవార్త;

ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తీసుకుంటామని మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు. శనివారం రాత్రి తుంగభద్ర గ్రామంలోని ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి డ్రైవర్ కచ్చితంగా లైసెన్సు యూనిఫాం కలిగి ఉండాలన్నారు. వాహనాలకు అన్ని రకాల అప్‌డేట్ కార్డ్ ్స కలిగి ఉండాలన్నారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, ఆటో డ్రైవర్లు ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో పంచాయితీ ఎన్నికలు

రుద్రవరం,నవంబర్ 14,ప్రభాతవార్త:

మండల పరిధిలోని గ్రామాలలో జరగనున్న పంచాయితీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్.ఐ.మహమ్మద్ రఫీ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతు మండలంలో నేటి నుండి జరగనున్న పంచాయితీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో ఎన్నికల నియమ నిభంధనలు తప్పని సరిగా పాటించాలన్నారు. నామినేషన్‌లో భాగంగా నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో దూరంగా ఉండాలని, నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థితో పాటు మరో ఇద్దరికి మాత్రమే లోపలికి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ కేంద్రం పరిధిలో 104 సెక్షన్‌తో పాటు పోలీసు చట్టం సెక్షన్ 30 అమలులో ఉంటుందన్నారు. అనుమతి లేకుండా గుంపులుగా చేరడం నిషేధించామన్నారు. ర్యాలీలు ఊరేగింపులు డీజే సిస్టం ఉపయోగించరాదని, అలాగే మారణాయుదాలు వెంట తీసుకురావడం నిషేదమన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆయన తెలిపారు.



గ్రామపంచాయతీ ఎన్నికలపై ఆర్ఓలకు డిజిటల్ అసిస్టెంట్‌లకు శిక్షణ

పగిడ్యాల, నవంబరు 14,ప్రభాతవార్త

ఆ ంధ్రప్రదేశ్ ఎన్నికల కమీషన్ ఆదేశాలమేరకు స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో శనివారం టెలికాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు.మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ పై ఆర్ఓలకు, ఏఆర్ఓలకు, డిజిట్ అసిస్టెంట్‌లకు ఎంపిడిఓ శ్రీమతి సుమత్రమ్మ ,డిప్యూటీ ఎంపిడిఓ అబ్బుర్ రహీం శిక్షణ ఇచ్చారు. మండలంలో 8గ్రామపంచాయతీలు ఉన్నాయనీ నె ప్రూనగర్ గ్రామవంచాయతీ, పాత ముచ్చుమర్రి, కొత్త ముచ్చుమర్రి, పగిడ్యాల, సంకిరేణిపల్లె, ప్రాతకోట, లక్ష్మాపురం, ఎం.ఘనపురం గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మూడవ విడత గ్రామ పంచాయతీలకు 19వ తేదీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందనీ తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం విదులు నిర్వహించవలసి వుంటుందనీ శ్రీమతి సుమిత్రమ్మ, డిప్యూటీ ఎంపిడిఓ అబ్బుర్ రహీం తెలిపారు.

